నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.

రంగారెడ్డి శనివారం 30-05-2026 సంపుటి: 02 సంచిక :29 వేల: 2 రూ పేజీలు :08 ఎడిటర్: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday 30-05-2026 volume:02 Issue:29 Rs:2 Pages:08 Editor:Katta Himapavani

Contact Number
9059328777



## ఐపీఎల్ ఫైనల్లోకి గుజరాత్

- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంచరీ
- సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ
- సూర్యవంశీ 96 పరుగుల పోరాటం వృథా

**క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు**



**హైదరాబాద్ మే 29 (నేటి దర్శిని):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104) బాధ్యతాయుతంగా ఆడి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించాడు.

-మిగతా 2 లో



## పదవి పోయినా పెత్తనం నాదే..

- ఢిల్లీలో చక్రం తిప్పుతున్న సిద్ధూ
- సమన్వయ కమిటీ కోసం పట్టు
- తనయుడికి కీలక శాఖలు కేటాయించాలని డిమాండ్

**బెంగళూరు, మే 29 (నేటి దర్శిని):** కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తుండగా కొత్త ప్రభుత్వం ఏర్పడేంతవరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య కొనసాగనున్నారు. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదోన్నతికి మార్గం సుగమం చేసేందుకు తన పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించేందుకు ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ప్రతిపాదించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో కలిసి డీకే వచ్చే వారం ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి.

-మిగతా 2 లో



## సర్ తో అందరికీ సమస్యే

- లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు నష్టం
- సర్ తో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంచుకోవాలి
- దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదం : సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ మే 29 (నేటి దర్శిని):** ప్రత్యేక విస్తృత సవరణ (సర్ )తో లంబాడీలు, ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ, పీసీసీ అడ్వైజరీ కమిటీ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ పైన అందరు అవగహన పెంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామమని అభినందించారు. సర్ లంబాడీ లు ,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావొచ్చన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజలు పెద్ద ఎత్తున వలస పోయారనీ, అలాంటి వారితో పాటు మహిళలకు కూడా సర్ వల్ల సమస్యలు ఎదురుకావొచ్చని చెప్పారు. సర్ కారణంగా దళితులు,

-మిగతా 2 లో

# ప్రతి గింజా కొంటాం

## రైతులు ఆందోళన చెందొద్దు

- అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దు
- తడిసిన ధాన్యం 9 వేల మెట్రిక్ టన్నులు కొన్నాం
- ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చాం
- రెండు లక్షల మంది సిబ్బంది పని చేస్తున్నారు
- బీజేపీది రైతు ఘోష యాత్ర కాదు... ? అధికార ఘోష యాత్ర : మంత్రులు
- ఎన్ ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్ మే 29 (నేటి దర్శిని):** ఇటీవల కురిసిన వర్షాలకు తడిన తడిసిన ధాన్యాన్ని 9వేల మెట్రిక్ టన్నులను కొన్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ధాన్యం సరఫరాకు ఇసుక, సిమెంట్ లారీలు, డీసీఎంలను సమకూర్చామని తెలిపారు. ధాన్యం సేకరణలో దాదాపు రెండు లక్ష?ల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. 2008 రైస్ మిల్లులలకు 13వేల వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. 20.86 కోట్ల గన్నీ బ్యాగులు

-మిగతా 2 లో





## కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

- అమెరికా యుద్ధ విమానాన్ని కూల్చేశాం: ఇరాన్
- అలాంటిదేమీ లేదన్న యూఎస్

**టెహ్రాన్ మే 29 (నేటి దర్శిని):** అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. రెండు దేశాలూ పరస్పర దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ అధికారిక మీడియా ఒక కీలక ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని కూల్చేశామని ప్రకటించింది.

-మిగతా 2 లో



## రైతు డిస్కం ప్రభుత్వ కుట్ర

- రైతుల భవిష్యత్తును ఆగం చేసే ప్రతిపాదన
- ఈఆర్సీ దీనిని రిజెక్ట్ చేయాలి
- రైతు డిస్కంపై పబ్లిక్ హియరింగ్‌లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్‌మే 29 (నేటి దర్శిని):** రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రైతులు అడగకుండానే విద్యుత్ సంస్కరణల పేరుతో చేపట్టిన ఈ చర్య రైతుల పాలిట

-మిగతా 2 లో

## ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత



- క్యూఆర్ పరిధిలో సంతృప్తినిచ్చే ఇళ్ల డిజైన్
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్‌మే 29 (నేటి దర్శిని):** పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

-మిగతా 2 లో

# యూపీఎస్సీని చూసి బుద్ధి తెచ్చుకోండి


**కేంద్రంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**

- నీట్ పేపర్ లీకేజీ అత్యంత బాధాకరం
- యువతను నిరాశపరచడం మంచిది కాదన్న ధర్మాసనం
- ప్రత్యేక అఫిడవిట్ దాఖలుకు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశం

**న్యూఢిల్లీ,మే 29 (నేటి దర్శిని):** నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసుపై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటువంటివి జరగడం చాలా బాధాకరమని సుప్రీంకోర్టు పేర్కొన్నది. నిజమైన జవాబుదారీతనం ఏర్పడే వరకు అసలు సమస్య ఆగదని స్పష్టం చేసింది. మనం మన యువతను నిరాశపరచకూడదని తెలిపింది. నీట్ పరీక్షల నిర్వహణ, ముగింపు ప్రక్రియను ప్రతి ఏటా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా సంస్థాగతం చేసే

-మిగతా 2 లో





## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

- ముద్రణ ఖర్చు తగ్గించే దిశగా కీలక కసరత్తు!
- పాలిమర్ నోట్లే పరిష్కారమని భావిస్తున్న ఆర్‌బీఐ!
- ఏటా వేల కోట్ల విలువైన కరెన్సీ రద్దు:
- ప్లాస్టిక్ నోట్లతో ఆ నష్టాన్ని నివారించే యోచనలో బ్యాంక్.
- త్వరలో పాలిమర్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్
- ఏటీఎంలలోనూ ఈజీగా పంపిణీకి ఆర్‌బీఐ ప్రణాళిక!

**న్యూఢిల్లీ**

పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల ను ప్రవేశపెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిసింది. రోజు రోజుకూ కరెన్సీ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ ప్లాన్ వేసింది. ఇటీవల పాట్నా, ముంబైలో జరిగిన ఆర్బీఐ బోర్డు సమావేశాల్లో పాలిమర్ నోట్ల గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు విస్తృతంగా చర్చించారు. పాలిమర్ నోట్లకు ఎక్కువ సెల్ఫ్ లైఫ్ ఉంటుందని, తయారీ కోసం తక్కువ ఖర్చు అవుందని భావిస్తున్నారు. సంప్రదాయకర కాగితం కరెన్సీ తయారీకి ఎక్కువ ఖర్చు అవుతుంది. అంతేకాకుండా పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పేపర్ నోట్ల కన్నా.. పాలిమర్ నోట్ల తయారీకి తక్కువ ఖర్చు అవుతుంది. ఏటీఎంల ద్వారా కూడా

-మిగతా 2 లో



## కార్యకర్తల కృషితోనే మహానాడు ఘన విజయం

- ప్రతి పల్లె, ప్రతి ఇల్లు మహానాడు వేదికగా మారింది
- మై టీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు
- మహానాడు చరిత్రలో కొత్త రికార్డు సృష్టించింది
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల తీర్మానానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు
- ప్రతి ఒక్కరి కృషికి శిరస్సువంచి నమస్కరిస్తున్నా
- కార్య నిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్

**అమరావతి మే 29 (నేటి దర్శిని):** తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని వివరించారు.

-మిగతా 2 లో

# ఐపీఎల్ ఫైనల్లోకి గుజరాత్

మొదటి తరువాయి

రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను రాజస్థాన్ నుంచి లాగేసుకున్నారు. ముఖ్యంగా గిల్, రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత రాహుల్ తెవాటియా (17 నాటౌట్) తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (45 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. చివర్లో డొనోవన్ ఫెరీరా (11 బంతుల్లో 38) విధ్వంసం సృష్టించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధించగా, రాజస్థాన్ రాయల్స్ ప్రస్థానం టోర్నీలో ముగిసింది. మే 31న (ఆదివారం) జరిగే టైటిల్ పోరులో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది

# పదవి పోయినా పెత్తనం నాదే..

మొదటి తరువాయి

రాహుల్‌కు కోర్కెల జాబితా

శుక్రవారం ఢిల్లీ చేరుకున్న సిద్ధరామయ్య పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలుసుకుని తన డిమాండ్ల జాబితాను సమర్పించినట్లు తెలిసింది. డీకే శివకుమార్ నేతృత్వంలోని కొత్త క్యాబినెట్‌లో తన కుమారుడు యతీంద్రకు కీలక శాఖలు కేటాయించాలని ఆయన కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్య క్యాబినెట్‌లో పీడబ్ల్యూడీ మంత్రిగా పనిచేస్తున్న సతీష్ జార్కిహోళికి కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని అధిష్ఠానం ఆఫర్ చేసినట్లు వర్గాలు తెలిపాయి. అయితే తన రాజకీయ గురువు సిద్ధరామయ్యతో చర్చించిన తర్వాత తన నిర్ణయం తెలియచేస్తానని ఆయన చెప్పినట్లు సమాచారం. కాగా, సిద్ధరామయ్య డిమాండ్లలో ఎన్నిటిని అధిష్ఠానం ఆమోదిస్తుందన్న విషయం ఆసక్తికరంగా మారింది.

జూన్ 3న డీకే ప్రమాణం

కర్ణాటక ముఖ్యమంత్రిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్ జూన్ 3న ప్రమాణం చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. సీఎం సిద్ధరామయ్య ఈ నెల 28న (గురువారం) తన పదవికి రాజీనామా చేయగా శుక్రవారం గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ దాన్ని ఆమోదించడంతో డీకే ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

# కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు

మొదటి తరువాయి

అయితే, ఈ ప్రకటనను అమెరికా ఖండించింది. టెహ్రాన్ చెప్తున్నట్టుగా అలాంటిదేమీ లేదని కొట్టిపారేసింది. శుక్రవారం తెల్లవారుజామున బుషెహర్ ప్రావిన్స్‌లోని జామ్ ప్రాంతంలో శత్రు దేశానికి చెందిన ఓ యుద్ధ విమానాన్ని అడ్డగించినట్టు టెహ్రాన్ మీడియా తెలిపింది. ఇరాన్ వైమానిక దళాలు ఆ ఫైటర్‌జెట్‌ను కూల్చివేశాయని స్థానిక గవర్నర్‌ను ఉటంకిస్తూ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా.. లేదా అనే పూర్తి వివరాలను మాత్రం అది వెల్లడించలేదు. ప్రస్తుతం బుషెహర్ ప్రాంతంలో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాయని తెలిపింది. మరోవైపు, దాడుల్లో యుద్ధ విమానం కూలిపోతున్న ఓ ఫొటోను ఇరాన్ ఆర్మీ ఎక్స్ ఖాతాలో పంచుకుంది. అయితే, ఈ వాదనలను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. బుషెహర్ ప్రావిన్స్ సమీపంలో అమెరికా విమానాన్ని కూల్చేశామంటూ ఇరాన్ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని వెల్లడించింది.

# రైతు డిస్కం ప్రభుత్వ కుట్ర

మొదటి తరువాయి

శాపంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు డిస్కం ఏర్పాటుపై తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ శుక్రవారం ఎర్రగడ్డలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ లో కవిత పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతులకు మంచి చేసే ఆలోచనలో ఉంటే ఆరు నెలలుగా ఈ విషయాన్ని ఎందుకు దాచి ఉంచిందో చెప్పాలన్నారు. ఈ అంశంపై 33 జిల్లాల్లో పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానూ వయబుల్ కాని ఈ ప్రపోజల్ ను తిరస్కరించాలని ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. ఇంతటి కీలకమైన అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి అసెంబ్లీలో చర్చ పెట్టాలన్నారు. అసలే డిస్కం ల పరిస్థితి బాగాలేని సమయంలో రూ. 25 వేల కోట్ల నష్టంతో ఉన్న డిస్కం ను కంపెనీ పేరుతో ఎలా రిజిస్టర్ చేస్తారని ఆమె నిలదీశారు. డిస్కం ల బకాయిలు రూ. 69 వేల కోట్లు ఉంటే అందులో 54 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచే రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లిస్తే మన డిస్కం లు మంచి రేటింగ్ లోకి వస్తాయని చెప్పారు. పైగా కొత్త డిస్కం కు యూనిట్ 6 రూపాయలు ఖర్చయ్యే థర్మల్ విద్యుత్ ను కేటాయిస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్, లిఫ్ట్ ఇరిగేషన్ విద్యుత్, రైతులకు ఇచ్చే విద్యుత్ కు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నా కే రూ. 54 వేల కోట్ల పెండింగ్ పెట్టిన ప్రభుత్వం కొత్త డిస్కం కు ఎక్కడ నుంచి డబ్బులు ఇస్తుందని ప్రశ్నించారు డిస్కంల నష్టాలను సాకుగా చూపి ఒక డిస్కం ను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. అటు రైతుల మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పి ఇప్పుడు మాత్రం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తుందన్నారు ఈఆర్సీ నుంచి ఎలాంటి అనుమతి రాకుండానే జూన్ 2 నుంచి కొత్త డిస్కం పని

## ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై దృష్టి పెట్టిన ఆర్బీఐ!

మొదటి తరువాయి

ఈజీగా పాలిమర్ నోట్లను పంపిణీ చేయవచ్చు అన్న ఆలోచనలో ఆర్బీఐ ఉంది. పాలిమర్ కరెన్సీ నోట్లకు చెందిన పైలట్ ప్రాజెక్టును ఆర్బీఐ త్వరలో ప్రకటించనున్నది. పేపర్ మనీ ప్రింటింగ్ కోసం అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయిందని, 5101.4 కోట్ల నుంచి 6,372.8 కోట్లకు ఆ ఖర్చు చేరుకుందని ఇటీవల ఆర్బీఐ వార్షిక నివేదికలో పేర్కొన్నది. బ్యాంక్ నోట్ల ప్రింటింగ్ కోసం డిమాండ్ పెరగడం వల్ల ఖర్చు పెరిగినట్లు నివేదికలో తెలిపారు. ఇక పాడైన, పాతబడిపోయిన, చిరిగిన పేపర్ కరెన్సీ నోట్ల సంఖ్య కూడా పెరిగిపోయింది. 2025 వార్షిక సంవత్సరంలో సుమారు 23.8 బిలియన్ల చిరిగిన నోట్లను రద్దు చేశారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 12.3 శాతం అధికం. 2024 వార్షిక సంవత్సరంలో సుమారు 21.24 బిలియన్ల చిరిగిన కరెన్సీ నోట్లను రద్దు చేసినట్లు తెలిసింది. 500, 100 నోట్లు ఎక్కువగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. 1988లో తొలిసారి ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టింది. 1996 నాటికి ఆ దేశం పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను వినియోగంలోకి తెచ్చింది. ఇక కెనడా 2011లో పాలిమర్ కరెన్సీ నోట్లను తెచ్చింది. అయితే పేపర్ కన్నా పాలిమర్ బెటర్ అని కెనడా అనేక విశ్లేషణలు చేసింది.

# ప్రతి గింజా కొంటాం

మొదటి తరువాయి



అందుబాటులో ఉన్నాయన్నారు. కానీ ప్రతిపక్ష?లు ధాన్యం సేకరణలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘురామ్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. స్వతంత్ర భారత దేశంలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో అత్యధిక ధాన్యాన్ని సేకరించిందని గుర్తు చేశారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే తన నివేదికల్లో పేర్కొందని తెలిపారు. పదేండ్ల కాలంలో సేకరించిన పోల్చితే ఎక్కువగా కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిందన్నారు. కేంద్రం సర్కారు నిర్ణయించిన మద్దతు ధర నిబంధలు పాటిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని విమర్శించారు. అయినా రూ. 16,479 కోట్లు అదనంగా చెల్లించి కొనుగోలు చేశామని చెప్పారు. కాళేశ్వరం, సుందిళ్ల రిజర్వాయర్ ఉపయోగించకుండానే అత్యధిక పంట ఉత్పత్తి జరుగుతోందన్నారు. చివరి గింజా వరకు కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో 1.41 లక్ష?ల మెట్రిక్ టన్నులు వరి ఉత్పత్తి అవుతోందనీ, అందులో 75 లక్ష?ల మెట్రిక్ టన్నుల సేకరిస్తామన్నారు. కానీ 52 లక్ష?ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకుంటాం. మిగతాది తీసుకోలేమంటూ కేంద్రం మెలిక పెట్టిందని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని కొని కూడా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో కూలీలు పని చేయడం లేదనీ, పూర్తిగా బీహార్ హమాలీలపై ఆధారపడి ఉందన్నారు. బీహార్‌లో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడం, బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో కూలీల కొరత ఏర్పడిందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు బీఆర్ఎస్ సర్కారు రూ. 15వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ. 49వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వం 7వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ సర్కారు 8575 కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 2024-25లో రూ. 36,143 కోట్లు, 2025-26లో రూ.39,359 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఆ సొమ్మును 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు.

# సర్ తో అందరికీ సమస్యే

మొదటి తరువాయి

మైనారిటీలు, మహిళల ఓట్లు పోయే ప్రమాదముందని అప్రమత్తం చేశారు. సర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బూత్ ఎన్ రోలర్ సాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్ షిప్ చేయించామనీ, ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి రాహుల్ గాంధీ తో సన్మానం చేయించామని ఆయన గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్ రోలర్స్ ను స ర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. డిజిటట్ మెంబర్ షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇన్ చార్జీని నియమించి నిరంతరం పర్యవేక్షించామని తెలిపారు. సర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్ సభ నియోజకవర్గాలకు ఇన్ చార్జీలను నియమించాలనీ, అసెంబ్లీ ఇన్ చార్జీలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని దిశానిర్దేశం చేశారు. ఇన్ చార్జీలు సరిగ్గా పని చేస్తే ఒక్క ఓటు కూడా?తొలగించకుండా అడ్డుకోవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు. ఇన్ చార్జీ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పనిచేయాలనీ, క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తాననీ, నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తానని తెలిపారు. తనతో పాటు ఎవరికి మినహాయింపు ఇవ్వొద్దనీ, పార్టీ కోసం అందరూ పని చేయాల్సిందనని తేల్చి చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లతో సహా ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. దాదాపుగా నామినేటేడ్ పోస్టులను భర్తీ చేశామనీ, పార్టీ తరుపున ప్రస్తుతం వేలాది మంది సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్లు, కౌన్సిలర్లు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. వలసలు పోయిన వారి ఓట్లు పోకుండా పార్టీ నాయకులంతా సమన్వయం తో జాగ్రత్త పడాలని కోరారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యత అప్పగించాలనీ, నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో సర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాలని సూచించారు. సర్ పైన మహిళా కాంగ్రెస్ తరుపున క్లస్టర్ల వారీ గా సమావేశాలు నిర్వహించాలన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత

మొదటి తరువాయి



పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూఆర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు... భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# యూపీఎస్సీని చూసి బుద్ధి తెచ్చుకోండి

మొదటి తరువాయి

యంత్రాంగాన్ని రూపొందించే వివరాలను తెలియచేస్తూ ఒక ప్రత్యేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని కేంద్ర విద్యా శాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రత్యేక సిబ్బందిని నియమించడం, విస్తృత శ్రేణి నిపుణులను కలిగి ఉండటం ద్వారా ఎన్‌టీఏలో సంస్థాగత నైపుణ్యాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో అఫిడవిట్‌లో వివరించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాదేలతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. 2024, 2026 నీట్ పరీక్ష వివాదాల వంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి అవసరమైన భౌతిక, మేధోపరమైన సామర్థ్యాలను ఎన్‌టీఏ కలిగి ఉండేలా చూడటమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని కోర్టు పేర్కొన్నది. ఆరు వారాల్లోగా అఫిడవిట్‌ను దాఖలు



చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ఎన్‌టీఏ, ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ డాక్టర్ కే రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

పర్యవేక్షణ యంత్రాంగాలు, పర్యవేక్షక కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)తో పోలుస్తూ దేశంలోని అత్యున్నత సివిల్ సర్వీసెస్ పరీక్ష అయిన యూపీఎస్సీలో ఇలాంటి సంఘటనలు ఎన్నడూ జరగలేదని కోర్టు వ్యాఖ్యానించింది. యూపీఎస్సీ వ్యవస్థల నుంచి గుణపాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉందని సూచించింది. ఇస్రో మాజీ చైర్మన్ రాధాకృష్ణన్ కమిటీ అఫిడవిట్‌ను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.

# కార్యకర్తల కృషితోనే మహానాడు ఘన విజయం

మొదటి తరువాయి

ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీమ్ కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి అమోదంతో హైబ్రిడ్ విధానంలో మార్చామని మంత్రి లోకేష్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడు ఒక అవకాశం తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడు ప్రతి పల్లె, ప్రతి ఇల్లా మహానాడు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడించిందన్నారు. కార్యకర్తలే అధినేతలే.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివిని ఎరుగని రీతిలో విజయవంతం చేశారని చెప్పారు. స్త్రీ శక్తి



ధీమకు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి అమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి లోకేష్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మై టీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఐటీడీపీ, ఐటీడీపీ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేష్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

# పెంబర్తి-అంబాల గ్రామాల అనుసంధానానికి మరో కీలక అడుగు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


**● రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకుశంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



**ఉమ్మడి వరంగల్ ,మే 29 (నేటి దర్శిని బ్యూరో):** గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పేర్కొన్నారు.హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం పరిధిలోని పెంబర్తి గ్రామం నుండి అంబాల గ్రామం వరకు రూ.1 కోటి 50 లక్షల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , కుడా ఛైర్మన్ శ్రీ ఇనుగాల వెంకట్రామిరెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాణ్యమైన రహదారుల నిర్మాణం ఎంతో అవసరమని అన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా వేగవంతం అవుతాయని తెలిపారు.పెంబర్తి నుండి అంబాల వరకు నిర్మించనున్న ఈ బీటీ రోడ్డు వల్ల రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు మరియు అత్యవసర సేవల వినియోగదారులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతోందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు చెప్పారు.ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని పేర్కొన్న ఎమ్మెల్యే, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసి వైస్ ఛైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డిస్థానిక సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్ జోరిక పులక్కా తో పాటు మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు రుణాల పంపిణీ...

**● ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి...**






**ఆమనగల్లు,మే29(నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం 99 రోజుల"ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక" లో భాగంగా మహిళా వారోత్సవాల మహిళా శక్తి సభ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. మహిళా సంఘాలకు రెండు కోట్ల 20 లక్షల నిధులను వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఆమనగల్ సిఐ ఎస్.వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు తెలగమల్ల జగన్, మానయ్య, కౌన్సిలర్లు కోగూరి అనితా శ్రీనివాసరెడ్డి, ఎనుమల రమేష్,కో ఆప్షన్ మెంబర్ ఎండి అబ్దుల్ ఖాదర్, ఐఎన్ టియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యంగలి ప్రసాద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోగురి శ్రీనివాసరెడ్డి, కృష్ణా నాయక్, శ్రీశైలం, మహేష్, కుమార్ గౌడ్, పార్టీ కార్యకర్తలు, పట్టణ ప్రజలు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్దే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

**● రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**




**ఉమ్మడి వరంగల్, మే 29 (నేటి దర్శిని బ్యూరో):** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజ్ అన్నారు.హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం పరిధిలోని సుదనపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, అంగన్‌వాడీ భవనాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, విద్యా, ఆరోగ్య, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.సుదనపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు వల్ల గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ద్వారా చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన సేవలు అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, ప్రాథమిక విద్యా బోధనకు అనుకూలమైన వాతావరణం కల్పించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ అభివృద్ధి పనులు పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే నాగరాజు కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆకారపు లక్ష్మి – లింగస్వామి, ఉప సర్పంచ్ ఆళ్ల దేవేందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఆత్మకూరు ఏఎంసి వైస్ ఛైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంగళపల్లి అంగన్వాడీ కేంద్రంలో 1000 రోజుల ప్రణాళిక...








**ఆమనగల్లు,మే29(నేటి దర్శిని):** ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి గ్రామపంచాయతీ లోని మంగళపల్లి మరియు చెన్నకేశవ కాలనీ లోని అంగన్వాడీ కేంద్రాలలో 1000 రోజుల ప్రణాళిక(గోల్డెన్ డేస్) గురించి చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళపల్లి గ్రామ సర్పంచ్ మౌనిక శివ హాజరయ్యారు. మహిళలకు, గర్భిణీ బాలింతలకు'ఈసీసీ దే'పూర్వ ప్రాథమిక విద్య గురించి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు టి. పద్మ,ఎస్. అనిత,పి.పద్మ, అంగన్వాడి సహాయకురాలు లక్ష్మమ్మ,వరమ్మ, మరియు గర్భిణీ స్త్రీలు, బాలింతలు,తల్లులు, పిల్లలు,తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో సూర్యుడు ప్రతాపంతో ప్రజల ఇబ్బందులు....!

**● వరంగల్ నగరంలో ఎండవేడికి రోడ్లన్నీ నిర్మానుష్యం**





**ఉమ్మడి వరంగల్, మే 29 ( నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం సూర్యుడు భగభగ మండడంతో చిన్నారులకు, వృద్ధులకు ఇబ్బందులు తప్పలేదు. ఉక్కపోతతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .వరంగల్ నగరంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. నిప్పుల గాలితో నేల మండిపోవడంతో జనం బయటకు రావడానికి జంపుతున్నారు. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే పోచ మైదానం సెంటర్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రత ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇల్లు నుంచి బయటికి రావద్దని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వరంగల్ జిల్లాలో 45.7ళీ, జనగామలో47.7 డిగ్రీలు, భూపాలపల్లి జిల్లాలో 45.8ళీ, మహబూబాబాద్, ములుగు జిల్లాలో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెడ్ అలర్ట్ జారీ కొనసాగుతుంది. సాయంత్రం 6 గంటలకు వడగడుపులతో జనం రోడ్లపైకి రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసర సరుకులకు కూరగాయలకు మార్కెట్ కు వెళ్లడానికి అనేక అవస్థలు పడుతున్నారు. రోహిణి కార్తి కొనసాగుతుండడంతో సూర్య ప్రతాపం ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. మృగశిర కార్తి జూన్ 8 నుంచి వస్తున్న దృష్ట్యా అప్పటివరకు వర్షాలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తేనే భూమి వేడిమి తగ్గుతుందని అప్పటివరకు సూర్యునిప్రతాపానికితట్టుకోవాల్సిందేనని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెట్ల నీడల్లో కాలం వెలదీస్తున్నారు. పట్టణాల్లో పగటిపూట ఏసీలలో, కూలర్ల దగ్గర కాలం వెళ్లదీస్తున్నారు. బస్సులలో ప్రయాణం చేయడానికి కూడా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనా వర్షాకాలం వరకు వేచి చూడవలసిందే...!

# గ్రామాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలకు సౌలభ్యం: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

**● 10 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే**



**ఉమ్మడి వరంగల్, మే 29 (నేటి దర్శిని బ్యూరో):** గ్రామాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలగడంతో పాటు వ్యవసాయ, విద్యా ,వైద్య అవసరాలకు చేరువ కావడం సులభతరం అవుతుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పేర్కొన్నారు.హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం పరిధిలోని సీతానాగారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన అంతర్గత రోడ్డు ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేకేఆర్ నాగరాజు , కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపడుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా ముందుకు సాగుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.సీతానాగారం గ్రామంలో నిర్మించిన ఈ రహదారి వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, గ్రామ అభివృద్ధికి ఇది మరో ముందడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రతి పనిని పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రహదారి ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే నాగరాజు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూకట్ల సునీత–రమేష్, ఆత్మకూర్ ఏఎంసి వైస్ ఛైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు



కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజీవ్రాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ది పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్దాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్ఎస్ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 -52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# స్నేహ సంఘాలు ఏర్పాటు






**- కిషోర్ బాలికల నాయకత్వ లక్షణాలపై సమీక్ష సమావేశం**

**గాంధారి, మే 29 (నేటి దర్శిని):**
గాంధారి మండలం కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో స్నేహ సంఘాల ఏర్పాటు ద్వారా కిషోర్ బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన గణనీయంగా పెరుగుతున్నాయి. గ్రామ స్థాయిలో ఏర్పడుతున్న ఈ సంఘాలు బాలికలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి, సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు అన్వేషించడానికి మంచి వేదికగా నిలుస్తున్నాయి.సమీక్ష సమావేశంలో బాలికలలో కనిపించిన ముఖ్యమైన నాయకత్వ లక్షణాలు సమూహాన్ని సమన్వయం చేసే సామర్థ్యం బాధ్యతాయుతంగా వ్యవహరించడం సమావేశాలను నిర్వహించే నైపుణ్యంనిర్ణయాలు తీసుకునే ధైర్యం సామాజిక సమస్యలపై అవగాహన పెరగడం విద్య, ఆరోగ్యం, పరిశుభ్రతపై చైతన్యం కల్పించడం ఇతర బాలికలను ప్రోత్సహించే గుణం స్నేహ సంఘాల ద్వారా బాల్య వివాహాల నిరోధం, పాఠశాల హాజరు పెంపు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో కూడా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. బాలికలు భవిష్యత్తులోసమాజానికి ఆదర్శ నాయకులుగా ఎదగడానికి ఈ సంఘాలు బలమైన పునాది వేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిషోర్ బాలికలకు వివిధ రకాల ఆటలు నిర్వహించడం జరిగినది. బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సహస్ర, రెండవ బహుమతి నిహారిక, ఈసందర్భంగా నిర్వాహకులు విజేతలను అభినందించి, బాలికల్లో ప్రతిభ, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ప్రసన్నకుమార్, గ్రామ సంఘ అధ్యక్షురాలు కళావతి, సిసిలు గౌర్రె రాములు, సౌజన్య, సిఐలు స్వప్న, లక్ష్మీదేవి,లావణ్య,వనిత, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# మనుషులకూ మూడో కన్ను..

**దృష్టి పరిణామ క్రమంలో కొత్త కోణం కనుగొన్న న్యూరో సైంటిస్ట్‌లు**

**న్యూఢిల్లీ, మే 29 (నేటి దర్శిని):**
: న్యూజిలాండ్‌కు చెందిన 'ట్యుటారా' అనే వింతయిన బల్లిలాంటి జీవిని దగ్గరగా చూస్తే మీరు ఒక అద్భుతమైన విషయాన్ని గమనించవచ్చు. అదే.. పని చేసే మూడో కన్ను. ట్యుటారా తలకు ఇరువైపులా ఉండే ప్రధాన కండ్లలాగే ఈ మూడో కన్ను కూడా లెన్స్, రెటీనా, మెదడుకు అనుసంధానించబడిన నరాలను కలిగి ఉంటుంది. సరీసృపం వంటి వెన్నెముక ఉన్న జీవికి ఇంతటి అధునాతనమైన మూడో కన్ను ఉండడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ నిజం ఏమిటంటే మానవులకూ అలాంటిది ఒకటి ఉంది. 'పీనియల్ గ్రంథి' అని పిలిచే ఈ కన్ను పుర్రె కింద మెదడు లోపల లోతుగా దాగి ఉంటుంది. నేరుగా సూర్యకాంతి తగలకుండా ఉన్నప్పటికీ కాంతి, చీకట్లకు మన శరీరం ఎలా స్పందించాలో నిర్దేశించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తున్నది. కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన ఒక కొత్త పరికల్పన అసలు ఈ చిన్న గ్రంథి ఎక్కడి నుంచి వచ్చిందో వివరించడానికి ప్రయత్నిస్తున్నది. మూడో కన్ను మన అత్యంత పురాతన పూర్వీకుల నుంచి వచ్చిందని ఈ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అలాగే దీనిని అర్థం చేసుకోవడం ద్వారా దృష్టి పరిణామ క్రమంలో ఉన్న




అత్యంత లోతైన చిక్కుముడులలో ఒకదానికి ఎట్టకేలకు సమాధానం దొరకవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ ససెక్స్‌కు చెందిన న్యూరోసైంటిస్ట్, ఈ కొత్త అధ్యయన సహ రచయిత ప్రొఫెసర్ థామస్ బాడెన్ ప్రకారం.. పూర్వం మనం నిస్సారమైన సముద్రాలలో సముద్రగర్భం వెంబడి పాకే ఒక చిన్న పురుగు వంటి జీవి కంటే పెద్దగా ఏమీ లేము. ఇది నావిగేషన్ కోసం రెండు పక్క కండ్లను, కాంతి స్థాయిలను ట్రాక్ చేయడానికి, స్థిరంగా ఉండడానికి తలపై ఒక సాధారణ మధ్య కన్నును కలిగి ఉండే అవకాశం ఉంది. తర్వాత ఏదో మార్పు జరిగింది. చివరికి వెన్నెముక జీవులుగా మారే మన పూర్వీకులు తమ తలలను ఇసుకలో పాతుకోవడం ప్రారంభించారు. అడుగున ఉన్న అవక్షేపాలలో పూడుకుపోయి, పక్కనే తేలియాడే కణాలను ఆహారంగా తీసుకుంటూ బతికే వీటికి ఇకపై నావిగేట్ చేయాల్సిన అవసరం లేకుండా పోయింది.
అప్పటివరకు పెద్దగా ఉపయోగపడని, నిర్వహించడానికి ఎక్కువ శక్తి ఖర్చయ్యే పక్క కండ్లు క్రమంగా అంతరించిపోయాయి. మిగిలిందల్లా మధ్యలో ఉన్న సెన్సార్లు, ఫొటోరిసెప్టర్ల సమూహం మాత్రమే. ఇది పగలు, రాత్రిని, హెచ్చుతగ్గులను గుర్తించడానికి ఇప్పటికీ ఉపయోగపడుతున్నది. ఈ ఇసుకలో పూడుకుపోయే దశే వెన్నెముక జీవులు మిగతావాటికంటే భిన్నంగా ఉండడానికి కారణమని పరిశోధకులు సూచిస్తున్నారు. మిగతా అన్ని జంతువంశాలు తమ పక్క కండ్లను అలాగే ఉంచుకోగా, మనం మన కండ్లను కోల్పోయాము. ఒకరోజు వాటిని మళ్లీ కొత్తగా సృష్టించుకోవాల్సి వచ్చింది. అయితే అసలైన కన్ను పూర్తిగా మాయం కాలేదు. ఇది పీనియల్ గ్రంథిగా ఉండిపోయింది. ఇది సింహాల నుంచి బల్లులు, మీ వరకు దాదాపు అన్ని వెన్నెముక జీవులలో ఇప్పటికీ ఉన్నది. ట్యుటారాలు, కొన్ని ఇతర సరీసృపాలలో ఆ కణాలు దాదాపు పూర్తిగా రూపుదిద్దుకొన్న కన్నులాగే మిగిలిపోయాయి. చేపలలో ఇది కాంతిని నేరుగా గుర్తించే ఒక సరళమైన అవయవంగా ఉంది. క్షీరదాలలో ఇది ఆ సామర్థ్యాన్ని కోల్పోయింది. దానికి బదులుగా కండ్ల నుంచి వచ్చే సిగ్నల్స్ ద్వారా కాంతి సంకేతాలను అందుకుంటుంది.

# ఆయిల్ ప్యాకెట్ల సైజులో మార్పు?

**- కేంద్రంతో మార్కెట్ ప్రతినిధుల చర్చలు**

**న్యూఢిల్లీ, మే 29 (నేటి దర్శిని):**
కేంద్ర ప్రభుత్వం వంటనూనె ప్యాకెట్ల సైజులో కీలక మార్పులు చేసేందుకు రెడీ అవుతున్నట్టు తెలుస్తున్నది. 2023 జనవరి 1 నుంచి ఆయిల్ ప్యాకెట్ల సైజులో సడలింపులు ఇవ్వగా అనేక రకాల సైజుల్లో ప్యాకెట్లు దొరుకుతున్నాయి. ఈ ప్యాకెట్లతో ఇబ్బంది అవుతుందని, పూర్వ సైజుల్లోనే అమ్మాలని వినియోగదారుల శాఖతో ఆయిల్ మార్కెట్ ప్రతినిధులు మంగళవారం సమావేశం అయ్యారు. ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న 650gm, 700gm, 810gm, 850gm, 870gm ప్యాకెట్ల



తయారీని ఆపేయాలని ఇండస్ట్రీ ప్రతినిధులు కోరారు. నిబంధనల ప్రకారం ఉన్న 200ml, 500ml, 1ltr, 2ltr, 3ltr, 4ltr, 5ltr, 15ltr/kg, 20ltr/kg లోనే అమ్మేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆయిల్ మార్కెట్ ప్రతినిధులు చెబుతున్న దాని ప్రకారం.. మార్కెట్‌లో ప్రస్తుతం చాలా రకాల సైజుల్లో ప్యాకెట్లు దొరుకుతున్నాయి. దీంతో వినియోగదారులు ఏ ప్యాకెట్ ధర తక్కువగా ఉందో అర్థం చేసుకోలేకపోతున్నాడు. అన్ని ప్యాకెట్లు ఒకే సైజులో కనిపించినా ఆయిల్ పరిమాణం, ధరలో మార్పు గుర్తించలేకపోతున్నాడని ప్రతినిధులు చెబుతున్నారు. ఈ మేరకు సోయాబిన్ ప్రాసెసర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ అంశంపై ఈ నెల మొదట్లోనే కేంద్రానికి లేఖ రాసింది. సోపా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎన్ పతాక్ మాట్లాడుతూ మిల్లీలీటర్లు, గ్రాముల్లో తేడాను, ధరలను వినియోగదారుడు గుర్తించలేడని ఆయన తెలిపారు.

# వరకట్నం కోసం వేధించే వారికి గట్టి సందేశం వెళ్లాల్సిందే

**-వరుడి కుటుంబానికి విధించిన శిక్షను సమర్థించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, మే 29 (నేటి దర్శిని):**
దేశంలో పలుచోట్ల కొనసాగుతున్న వరకట్న వేధింపులపై తీవ్రంగా విరుచుకుపడిన సుప్రీంకోర్టు, 2010లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఒక వరకట్న మరణం కేసులో బాధితురాలి భర్త కుటుంబ సభ్యులకు శిక్ష నుంచి ఉపశమనం కల్పించడానికి తిరస్కరించింది. పెండ్లయిన తర్వాత అత్తింటికి వచ్చిన కోడళ్లను అవమానించిన కుటుంబాలకు గట్టి సందేశం వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'ఎందుకు అబ్బాయిలు..




అమ్మాయిలను పెండ్లి చేసుకుని వారిని, వారి కుటుంబాలను అవమానిస్తారు? వధువును, వారి కుటుంబ సభ్యుల అవమానించడం ఇకపై కొనసాగించ లేరనే గట్టి సందేశం వారికి ఈ శిక్ష ద్వారా వెళ్లాల్సిందే' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.వరుడు కుటుంబానికి శిక్ష నుంచి ఉపశమనం కల్పించడానికి ఆమె తిరస్కరించారు. జస్టిస్ భుయాన్ కూడా ఉన్న ఈ ధర్మాసనంలో కింది కోర్టు, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు విధించిన శిక్షల్లో జోక్యం చేసుకోవడానికి తిరస్కరించింది. పిటిషనర్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ శిక్షను కొనసాగించాలని స్పష్టం చేసింది. కాగా, మధ్యప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ట్విషా అనే మహిళ ఆత్మహత్య కేసుపై విచారణ జరుగుతుండగా, అలాంటి తరహా కేసులోనే నిందితుల శిక్షను నిర్ధారిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం గమనార్హం.

# కాళేశ్వరంలో బ్రహ్మకుమారిస్ సంస్థ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు...!



**ఉమ్మడి వరంగల్, మే 29 (నేటి దర్శిని బ్యూరో):** కాళేశ్వరంలో భక్తుల కోసం బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలో భారత దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల ఆకృతులను ప్రత్యేకంగా ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు విచ్చేసిన భక్తులకు ఒకే చోట 12 జ్యోతిర్లింగాల రూపాలను దర్శించుకునే అవకాశం కలగడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం అంత్యపుష్కరాల్లో జ్యోతిర్లింగాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో 474 జీరో ఎన్రోల్మెంట్ స్కూల్స్...!



**ఉమ్మడి వరంగల్, మే29 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలు 474 మూతపడ్డాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3369 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జీరో ఎన్రోల్మెంట్ క్రింద వరంగల్ జిల్లాలో 135, హనుమకొండ జిల్లాలో 36, భూపాల్ పల్లి జిల్లాలో 30, మహబూబాబాద్ జిల్లా లో 167, జనగామ జిల్లాలో 70, ములుగు జిల్లాలో 36 స్కూలు ఉన్నట్లు పేర్కొన్నారు. మూతపడ్డ స్కూల్లో విషయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 1441 పాఠశాలలో జీరో ఎన్రోల్మెంట్ ఉందని ,ఈ పాఠశాలను తెరిపించే బాధ్యతలను సర్పంచ్లకు అప్పగించినట్లు తెలుస్తుంది.

## చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెంపు: ఎంపీ డాక్టర్ కడియం కావ్య ,ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు

- గోపాలపూర్ ఊర చెరువు పూడికతీత పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్ ,మే 29 (నేటి దర్శిని బ్యూరో):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాలపూర్‌లోని ఊర చెరువు సుమారు కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులకు స్థానిక శాసన సభ్యులు కె.ఆర్ నాగరాజుతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యమాట్లాడుతూ, చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు చెరువు సామర్థ్యం పెరిగి వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో గోపాలపూర్ పరిసర ప్రాంతాల్లో ఎదురయ్యే వరద ముంపు సమస్యలను తగ్గించేందుకు ఈ పూడికతీత పనులుఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం అవసరమని, చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో 279 ఫ్రీ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు...!



**ఉమ్మడి వరంగల్, మే 29 ( నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి 279 ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల వారీగా జనగామ జిల్లాకు 39, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 41 ,ములుగు జిల్లాకు 36, మహబూబాబాద్ జిల్లాకు 76, వరంగల్ జిల్లాకు 48, హనుమకొండ జిల్లాకు 39 ఫ్రీ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.



# బీజేపీ ఓటర్ల జాబితాలతో ప్రమాదకర రాజకీయాలు చేస్తోంది: ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- ప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి సైనికుడిలా పనిచేయాలి
- ఓటు చోరీ ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలి
- సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే మా లక్ష్యం
- బి ఎల్ ఎలు, బి ఎల్ ఓలు కలిసి డోర్ టు డోర్ ప్రచారం చేపట్టాలి
- ఓటర్ల జాబితానే ఎన్నికల్లో విజయానికి తొలి అడుగు
- రాహుల్ గాంధీ ఓటు చోరీపై పోరాడుతున్నారు
- బీజేపీ కుట్రలను క్షేత్ర స్థాయిలో తిప్పికొట్టాలి
- కాంగ్రెస్ పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలి

**ఉమ్మడి వరంగల్ ,మే 29 (నేటి దర్శిని బ్యూరో)** ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. బిజెపి ఓటర్ల జాబితాలో ప్రమాదకర రాజకీయాలు చేస్తుందని ప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి సైనికుడిగా పనిచేయాలని అన్నారు. ఓటు చోరీ ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని, రాహుల్గాంధీఓటుచోరీపైపోరాడుతున్నారని తెలిపారు. బిఎల్ఓ లు డోర్ టు డోర్ ప్రచారం చేపట్టాలని అన్నారు.ఇతర రాష్ట్రాల్లోముఖ్యమంత్రులుగా పనిచేసిన నాయకులే తమ సొంత నియోజకవర్గాల్లో గెలవలేని ప్రమాదకర పరిస్థితులను బీజేపీ తీసుకొచ్చిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆరోపించారు. ఓటర్ల జాబితాలనిర్వహణలో నిర్లక్ష్యం, ఓటు చోరీ వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, ప్రతి ఓటును కాపాడుకునే బాధ్యత బూత్ స్థాయి నాయకులపై ఉందని ఎంపీ పేర్కొన్నారు.పరకాల ఎన్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,మహ్మద్ అయూబ్ తో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియంకావ్యమాట్లాడుతూప్రతి బూత్ ఏజెంట్ పార్టీకి సైనికుడిలా పనిచేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు, ఓటర్ల వివరాలు, ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రజలు తరచూ నివాస ప్రాంతాలు మార్చడం, అద్దె ఇళ్లలో నివసించడం, ఉద్యోగాల కారణంగా చిరునామాలు మారడం వల్ల ఓటర్ల జాబితాలోఖచ్చితత్వం నిలుపుకోవడం సవాల్‌గా మారుతోందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో సర్ ప్రక్రియ అత్యంత కీలకమని పేర్కొన్నారు.గతంలో 2002లో నిర్వహించిన సర్ ప్రక్రియ మళ్లీ 2026లో చేపడుతున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లు దీన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబాన్ని మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్ల గుర్తింపు, మారిన ఓటర్ల వివరాల సవరణ, అనుమానాస్పద నమోదుల పరిశీలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో సర్ పేరుతో ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న మార్పులను గమనించాలని, తెలంగాణలో ఇలాంటి పరిస్థితులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఓటు చోరీ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. మన ఓటును మనమే కాపాడుకోవాలనీ, ప్రతి బి ఎల్ ఏ ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.బూత్ లెవల్ ఏజెంట్లు, బి ఎల్ వోలతో కలిసి వచ్చే మూడు నెలలు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలనిసూచించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని అన్నారు. ఇప్పటికే డివిజన్‌ల వారీగా ఇన్‌చార్జిలను నియమించామని, రేపటి నుంచి బూత్ స్థాయి కన్వీనర్లు, ఏజెంట్లు, ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రూపొందించిన బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్ ను ఆవిష్కరించి బి ఎల్ ఏలు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు

- మహిళల భద్రతకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది
- మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి




**నాగోల్, మే29 (నేటి దర్శిని):** మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఈవ్‌టీజింగ్, లైంగిక , మానసిక వేధింపులకు పాల్పడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి స్పష్టం చేశారు. మహిళల భద్రతకు భంగం కలిగించే ప్రతి చర్యను పోలీసులు అత్యంత సీరియస్ గా తీసుకుంటారని హెచ్చరించారు. శుక్రవారం నాగోల్‌లోని పీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన "మహిళల భద్రత -- సంస్కారం" అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు వంటి ఘటనలకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని ఈ కార్యక్రమంలో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుమతి మాట్లాడుతూ.. మహిళను గౌరవించే సమాజమే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. మహిళల పట్ల గౌరవ భావం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, ప్రతి వ్యక్తి తమ ఇంట్లో ఉన్న మహిళలను ఎంత గౌరవిస్తారో అదే విధంగా సమాజంలోని ప్రతి మహిళను గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు.నేటి సమాజంలో మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు తదితర రంగాల్లో ముందంజలో ఉన్నప్పటికీ, ఇప్పటికీ అనేక రూపాల్లో వేధింపులకు గురవుతుండటం బాధాకరమన్నారు. కార్యాలయాలు, కళాశాలలు, బస్ స్టాప్‌లు, ప్రజా రవాణా, గృహ పరిసరాలు వంటి ప్రదేశాల్లో మహిళలు మానసిక వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు .మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న వారిలో మైనర్లతో పాటు 50 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు కూడా ఉండటం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. మహిళలను వేధించే వ్యక్తులు తమ కుటుంబాల్లో కూడా మహిళలు ఉన్నారనే విషయాన్ని గుర్తించి ప్రవర్తిస్తే ఇలాంటి ఘటనలు తగ్గుముఖం పడతాయని సూచించారు.గడిచిన ఐదేళ్లలో మహిళలపై వేధింపులకు సంబంధించిన కేసులు 350 నుంచి 365 వరకు నమోదయ్యాయని వెల్లడించారు. మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణ కోసం 13 షీటీమ్‌లు నిరంతరం పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు 760 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అందులో మైనర్లతో పాటు వయస్సు పైబడిన వారు ఉండటం సమాజంలో నైతిక విలువలు ఎక్కడికి వెళుతున్నాయని ప్రశ్నించారు.రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందని, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, సోషల్ మీడియా ద్వారా వేధింపులకు గురి చేసినా, వెంటాడినా, మానసిక వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను సంప్రదించాలని, షీటీమ్‌లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలని, తప్పుడు ప్రవర్తన వల్ల జీవితాలు నాశనం కావొచ్చని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై పర్యవేక్షణ పెంచాలని, వారు ఎక్కడికి వెళుతున్నారు, ఎవరితో తిరుగుతున్నారు అనే విషయాలను గమనిస్తే పిల్లలు మంచి క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని సూచించారు.మహిళల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్ ఘటనలను అరికట్టేందుకు మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో షీటీమ్ డీసీపీ ఉషారాణి, ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ పి. అనురాధ, డిప్యూటీ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీలు కృష్ణయ్య గౌడ్, వెంకటేశ్వరరావు, సైకాలజిస్ట్ గీతా చల్లా , నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీతో పాటు వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి పాలనలో పూర్తిగా విఫలమైన కమిషనర్

- జిహెచ్ఎంసిలో రిటైర్మెంట్, రిక్రూట్మెంట్ లేదా..?
- అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం
- అక్రమ నిర్మాణాలలో నెంబర్ వన్ స్థానానికి చేరుతున్న జిహెచ్ఎంసి
- సర్కిల్స్ పెంచారు కానీ సిబ్బంది, అధికారులు నియమించడం మరిచారు..!
- ఒక్క అధికారికి మూడు సర్కిల్ లు ఎక్కడ సక్రమంగా నిధులు నిర్వహించని వైనం
- సిబ్బంది అధికారులు తక్కువ అయిన అవినీతిలో మాత్రం నెంబర్ వన్ స్థానమా.?






**హైదరాబాద్, మే28 (నేటి దర్శిని):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలన పూర్తిగా గాడితప్పిందనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నగరం విస్తరిస్తోందని చెప్పుకుంటూ కొత్త 150 సర్కిల్స్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, వాటిని నడిపించేందుకు కావాల్సిన సిబ్బందిని, అధికారులను మాత్రం నియమించకపోవడంతో జిహెచ్ఎంసి వ్యవస్థ పాలన అంతా గందరగోళంగా మారింది. ఒక అధికారి మూడు మూడు సర్కిల్స్ బాధ్యతలు చూసే దుస్థితి నెలకొనగా, అక్రమ నిర్మాణాల మాఫియా మాత్రం ఈ బలహీనతను బంగారు గనిగా మార్చుకుంటోంది.

**ఏసీపీలు లేరు, సెక్షన్ ఆఫీసర్లు లేరు, చైన్‌మెన్లు కనిపించరు**

జిహెచ్ఎంసి పరిధిలో అనుమతి లేని భవనాలు, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు, సెల్లార్ ఆక్రమణలు రోజురోజుకూ ఇష్ట రాజ్యాంగ పెరుగుతున్నా వాటిని అడ్డుకునే సిబ్బంది, అధికారులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పలు సర్కిల్స్‌లో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ఏసీపీ లు), సెక్షన్ ఆఫీసర్లు, చైన్‌మెన్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ పూర్తిగా కుంటుపడింది. ప్రజల ఫిర్యాదులు పెరుగుతున్నా స్పందించేందుకు అధికారులు అందుబాటులో ఉండడం లేదు.

**ఫోన్‌లు ఎత్తరు, ఫీల్డ్‌కు రారు, నోటీసులు ఇవ్వరు**

తక్కువ మంది అధికారులు సిబ్బంది ఉన్న లంచాలు సేకరించడంలో మాత్రం నంబర్ వన్ స్థానంలో ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చివరకు అక్రమ నిర్మాణాలు పూర్తయ్యాక "చూస్తాం" అంటూ కాలం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత అధికారులకు వాటాలు ఇవ్వడంతోనే ఈ తతంగం జరుగుతుందన్న గుసగుసలు ఉన్నాయి.

**ఒక్క అధికారి, మూడు సర్కిల్స్..**

ప్రస్తుతం ఏర్పడిన మూడు కమిషనరేట్ల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో ఒకే అధికారి రెండు నుంచి మూడు సర్కిల్స్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అత్యంత దారుణమైన పరిస్థితి ఉంది. ఉదయం ఒక ప్రాంతంలో తనిఖీలు చేస్తే, మధ్యాహ్నం మరో సర్కిల్‌లో సమావేశం, సాయంత్రం ఇంకో చోట ఫిర్యాదులు, దానికి తోడు ఉన్నతాధికారుల మీటింగులు ఇలా అధికారులపై పని భారం పెరిగిపోవడంతో అసలు పరిపాలన పూర్తిగా కుప్పకూలిపోయింది. దీంతో అక్రమ నిర్మాణాల దందా చేసే బిల్డర్లు, రియల్ ఎస్టేట్ మాఫియా, బ్రోకర్లు రెచ్చిపోతున్నాయి. అధికారులు రావడానికి ముందే భవనం పూర్తి చేయాలి అన్నట్టుగా రాత్రింబవళ్లు పనులు సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో సెల్లార్లను కమర్షియల్ షాపులుగా మార్చడం, రోడ్లను ఆక్రమించడం, నాలా బఫర్ జోన్లలో నిర్మాణాలు చేయడం సామాన్యంగా మారిపోయింది.

**అక్రమ నిర్మాణాల్లో నంబర్ వన్‌గా గ్రేటర్ హైదరాబాద్**

ఒకప్పుడు ప్రణాళికాబద్ధ నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్, ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర శివారు నుంచి కోర్ సిటీ వరకూ ఎక్కడ చూసినా అనుమతులకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా చాలా భవనాలు నిర్మాణం అవుతున్నాయి. అధికారుల కొరతను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు కోట్ల రూపాయలు సంపాదిస్తుండగా, ప్రభుత్వ ఆదాయానికి మాత్రం భారీగా గండి పడుతోంది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడం వల్ల పన్నులు, పెనాల్టీలు, రెగ్యులరైజేషన్ ఫీజులు సక్రమంగా వసూలు కావడం లేదు. మరోవైపు అక్రమ నిర్మాణాల వల్ల ట్రాఫిక్ సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులు, అగ్నిప్రమాదాల ముప్పు పెరుగుతోంది.

**ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమా.?**

ప్రభుత్వ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుంది దానితో సిబ్బంది, అధికారులు పనిచేయక ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు ఇలా ప్రభుత్వ వైఫల్యంతోనే జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. పదేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా కాలం వెళ్లదీస్తున్న ప్రభుత్వ వైఖరిపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. కింది స్థాయి అధికారులు, సిబ్బంది లేక ఎలా పని చేయాలి.? అని ఉన్నతాధికారులే వాపోతున్న పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, సిబ్బంది లేకపోవడంతో అక్రమ నిర్మాణాల నియంత్రణ అసాధ్యంగా మారిందని ఉన్నత అధికారులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేసి, ప్రతి సర్కిల్‌కు పూర్తి స్థాయి సిబ్బందిని, అధికారులను నియమించకపోతే భవిష్యత్తులో గ్రేటర్ హైదరాబాద్ నగరం అక్రమ నిర్మాణాల కుప్పగా మారే ప్రమాదం ఉందని పట్టణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పదవ తరగతి టాపర్లకు ఘన సన్మానం..

- పీఆర్టీయూ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి...



**నారాయణపేట, మే 29(నేటి దర్శిని):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్‌లో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులకు సన్మాన, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ముఖ్య అతిథులుగా హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందిస్తూ, విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రఘువీర్, జేఎల్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



**చింతపల్లి, మే 29 (నేటి దర్శిని):** చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నక్కనమోని పరమేష్ కుటుంబంలో నిర్వహించిన చిన్నారులు నవ్యశ్రీ, విఘ్నేష్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా జరిగింది. మదనపురం గేట్ సమీపంలోని మోగుతాల యాదయ్య గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, చిన్నారులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్, కంకణాల వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కంకణాల ప్రవీణ్ వెంకట్ రెడ్డి, నాదిరి రమేష్, కేతావత్ శ్రీను నాయక్, మర్ల వెంకటయ్య, బదేపల్లి నిరంజన్ గౌడ్, వెంకట్ రెడ్డి, ఆరకంటి మురళి, నర్సింహ, శశిదర్ రెడ్డి, మహేష్, మోగుతాల శంకర్, జైపాల్ నాయక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేయాలి

- కోహెడ ఫ్రూట్ మార్కెట్ భూముల విషయంలో కలెక్టర్‌కు మంచిరెడ్డి కిషన్ రెడ్డి వినతి



**రంగారెడ్డి, మే 29 (నేటి దర్శిని):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కోహెడ గ్రామంలో ప్రతిపాదిత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం ఇప్పటికే కేటాయించిన భూములను పక్కనబెట్టి ప్రస్తుతం సర్వే నంబర్ 167/1లోని సుమారు 264 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సుమారు 160 మంది రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధానాల ప్రకారం తగిన నష్టపరిహారం అందించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే వచ్చే నెల 3వ తేదీన ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో, ఆలోపు రైతుల భద్రత, జీవనోపాధికి భరోసా కల్పించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్యపై ప్రశ్నిస్తున్న రైతులపై అరెస్టులు, బెదిరింపులు, దాడులు వంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు.

# బండ్లగూడ పాఠశాల అదనపు తరగతి గదులు ప్రారంభం




**నాగోల్, మే29 (నేటి దర్శిని):** దేశ వ్యాప్తంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఇండియా సంస్థ సేవలను మరింతగా విస్తృతపరుస్తామని జేసీఐ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఆర్పీపీ భరత్ ఎన్ ఆచార్య పేర్కొన్నారు. జేసీఐ హైదరాబాద్ దక్కన్ సంస్థ ఆధ్వర్యంలో జీఎస్ఐ బండ్లగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు స్వచ్ఛందంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ముఖ్యఅతిథిగా భరత్ ఎన్ ఆచార్య, విశిష్ట అతిథులుగా నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొగ్గారపు వరుణ్ లు విచ్చేసి జేసీఐ హైదరాబాద్ దక్కన్ విభాగం అధ్యక్షుడు కుషాల్ గుప్తా తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుషాల్ గుప్తా మాట్లాడుతూ.. బండ్లగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు చెరుకు భవానీశంకర్ గౌడ్ ద్వారా పాఠశాల దుస్థితి కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న బొగారపు వరుణ్ తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వెంటనే స్పందించి తమ సంస్థ ద్వారా రూ. 3 లక్షలు వెచ్చించి రెండు తరగతి గదులతో ఓ చిన్న హాలును విద్యార్థుల సౌకర్యార్థం షెడ్డు వేసి నిర్మించడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా జేసీఐ సంస్థ చేపడుతున్న సేవలను నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ అభినందించారు. జేసీఐ హైదరాబాద్ దక్కన్ సభ్యులను భరత్ ఎన్ ఆచార్య ఈ సం దర్భంగా అభినందించారు. ఇందులో భాగంగా ఆటోవాలాలు, బం డ్లగూడ గ్రామంలోని పలువురికి స్టీల్వాటర్ బాటిళ్లను సంస్థ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జోన్-12 అధ్యక్షుడు జేఎఫ్ఎస్ గౌతంకుమార్, ప్రథమ మహిళ జేసీ సీఏ సోనాల్ గుప్తా. బండ్లగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకు భవానీశంకర్ గౌడ్, స్థానికులు సహదేవ్ గౌడ్ సుర్వి శం కరయ్యగౌడ్, సుర్వి సురేష్ గౌడ్, కందికంట్ రాఘవేందర్ గౌడ్, మెట్టు ప్రభాకర్ గాడ్. సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవే మాధవ సేవ.. వృద్ధాశ్రమం

- పేదల బస్తీలో కృష్ణ గోపాల్ సేవా సమితి సేవా కార్యక్రమాలు







**ఎల్.బి.నగర్, మే 29 (నేటి దర్శిని):** "మానవునిలోనే మాధవుడు దర్శనమిస్తాడు" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రెండు సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. మొదటగా నగరంలోని ఒక వృద్ధాశ్రమంలో ఉదయపు అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి వృద్ధులు ఆనందంగా అల్పాహారాన్ని స్వీకరించి సమితి సభ్యులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు వృద్ధులతో కొంతసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం బేగంబజార్‌కు చెందిన చిన్నారి హర్వేష్ ఖాటోడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేదల బస్తీలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్వేష్ కుటుంబ సభ్యులందరూ పాల్గొని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. చిన్నారితో కలిసి కేక్ కట్ చేసి, చాక్లెట్లు పంపిణీ చేయడంతో పాటు అక్కడి చిన్నారులతో జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలకు కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగ్రవాల్ నాయకత్వం వహించగా, ట్రెజరర్ కుశ్ అగ్రవాల్, జాయింట్ సెక్రటరీ మనోజ్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సంజయ్ ధనావత్, సతీష్ యాదవ్, సునీల్ దర్డే, సురేష్ ధోలే తదితరులు సేవలందించి కార్యక్రమాలను విజయవంతం చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే దాతలు, సేవాభావం కలిగిన వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించి తమ వంతు సహకారం అందించవచ్చని సమితి ప్రతినిధులు తెలిపారు.

# మహిళలను కోటీశ్వరులను చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎన్.చెంద్రశేఖర్.
- మహిళ సమ్మైక్య ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం



**జిల్లేడు చౌదరిగూడెం.మే 29.(నేటి దర్శిని):** రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని జిల్లేడు చౌదరి గూడెం మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం మహిళ సమైక్య ఆధ్వర్యంలో ఋణమేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేయటం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి మన ఎమ్మెల్యే గౌరవ శ్రీ వీర్లపల్లి శంకర్ అన్న ఎమ్మెల్యే అయిన తరువాత మహిళా సంఘాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.ప్రభుత్వం వచ్చిన వెంబడే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంఘాలకు వడ్డీ లేని ఋణ మాఫీ,ఇందిరమ్మ చీరల పంపిణీ, మహిళా సంఘాలకు 2 లక్షల వరకు ఋనాన్నీ పెంచడం,మహిళా సంఘాలకు ఆర్టీసి బస్సులను అద్దెకు నడిపించుకునేలా అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. రేషన్ కార్డ్స్, అలాగే ఇందిరమ్మ ఇండ్లు, మరెన్నో ప్రభుత్వ పథకాలు మహిళల పేర్లపైన మంజూరు చేయడం జరుగుతుందన్నారు . రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఇంకా కొత్త పథకాలు తెచ్చి మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మన ఎమ్మెల్యే వీ ర్లపల్లి శంకర్ అన్న ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎపిఎం హరినాథ్ ,మహిళా సమైక్య అధ్యక్షురాలు, సెక్రటరీ, మహిళా సంఘాల గ్రామ అధ్యక్షులు సంఘము సభ్యులు,కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ,మాజీ సర్పంచ్ నర్సిములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుమార్, సర్పంచ్ నీలయ్య, నవీన్ యాదయ్య, వెలుగు సీసీలు సిబ్బంది,పాల్గొన్నారు.

# బేటీ బచావో-బేటీ పడావో

- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి




**దేవరకొండ మే 29.(నేటి దర్శిని):** నల్గొండ జిల్లా గుడిపల్లి మండలం లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం అంగన్‌వాడీ-2 కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రమీల, గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు సూచించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.కిశోర బాలికలకు ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పౌష్టికాహారం అందించాలని, వారి శారీరక మరియు మానసిక అభివృద్ధికి కుటుంబ సభ్యులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించి బాల్య వివాహాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. "బేటీ బచావో -- బేటీ పడావో" నినాదాలతో గ్రామంలో ప్రజలకు సందేశం అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు మరియు యువత పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సేన ఆధ్వర్యంలో జెండా పండుగ

- దేవరకొండ నియోజకవర్గంలో ఘనంగా కార్యక్రమం



**దేవరకొండ, మే 29 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ ఆధ్వర్యంలో ప్రతిపల్లెల్లో నిర్వహిస్తున్న జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా దేవరకొండ నియోజకవర్గంలో జెండా గద్దె నిర్మాణానికి అనుమతి కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి విక్రాంత్ రెడ్డి, జిల్లా అబ్జర్వర్ దేవేందర్ రెడ్డి సమక్షంలో దేవరకొండ అసెంబ్లీ ఇన్‌చార్జి నేనావత్ శివ నాయక్ స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.దేవరకొండ అసెంబ్లీ ఇన్‌చార్జి నేనావత్ శివ నాయక్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు ఆశించిన స్వరాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి దిశగా సాగాలి. పేదవాడి తలరాత మార్చే దిశగా, బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా నిలిచే కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలో బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడం మన బాధ్యత" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అబ్జర్వర్ పల్లె నిషా, పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య, పున్ని బాయ్, మహిళా నాయకురాళ్లు పద్మ, భాగ్య, అలాగే సురేష్ నాయక్, అనిల్ కుమార్, ప్రశాంత్, నరేష్, రవి, సంపత్ తదితర బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీసేవ భవనాన్ని పోలీస్ స్టేషన్‌కు కేటాయించొద్దు..






- వికాస్‌నగర్ మీసేవ కేంద్రం తరలింపుపై ఆగ్రహం..
- కాలనీవాసులతో కలిసి రెండో రోజు నిరసనలో పాల్గొన్నఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్,మే29 (నేటి దర్శిని):** మీసేవ భవనాన్ని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు కేటాయించవద్దని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక కాలనీవాసులతో కలిసి రెండో రోజు కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్ పరిధిలోని వికాస్‌నగర్‌లో ఉన్న వార్డు కార్యాలయ భవనంలో ప్రస్తుతం మీసేవ కేంద్రం, గ్రంథాలయం కొనసాగుతున్నాయి. ఈ భవనాన్ని ఖాళీ చేయించి అక్కడ చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే కాలనీలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు పెరగడంతో పాటు స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వివరించారు. దీంతో ఆయన స్థానికులతో కలిసి మీసేవ కేంద్రం వద్ద రెండో రోజు కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, వికాస్‌నగర్‌లోని మీసేవ కేంద్రాన్ని తొలగించి న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు తరలించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఈ నిర్ణయం వల్ల స్థానిక ప్రజలు ప్రభుత్వ సేవలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ స్థలంలో నిర్మాణంలో ఉన్న ఎల్బీనగర్ టిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలోనే పోలీస్ స్టేషన్ కోసం సుమారు 3,000 గజాల స్థలాన్ని కేటాయించారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రజలకు ఉపయోగపడుతున్న మీసేవ కేంద్రం, గ్రంథాలయాన్ని తొలగించడం సమంజసం కాదన్నారు. ప్రజల అవసరాలు, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.

# ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం

- -షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- -మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- -ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది
- -మహిళా శక్తి వారోత్సవాలలో భాగంగా షాద్ నగర్ పట్టణ మహిళా సంఘం మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**రంగారెడ్డి జిల్లా , మే 29 (నేటి దర్శిని):** షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తి వారోత్సవాల పట్టణ మెప్మా వారి ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన 4కోట్ల రూపాయలు గల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ...ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంఘాల వ్యవస్థ ప్రారంభమైనదని, దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల ద్వారా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పరిమితిని రూ 5 లక్షల నుండి 10 వరకు పెంచి, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. మహిళలకు ఉచితబస్ ప్రయాణం, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి తోడ్పడే మహిళా సమైక్య భవనాలు ఉపయోగపడతాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, కౌన్సిలర్ మురళీ మోహన్, దిలీప్, బచ్చలి నరేష్,కో ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, నేతలు కృష్ణ రెడ్డి, నల్లమోని శ్రీధర్, మహమ్మద్ ఇబ్రహీం, బాలరాజు గౌడ్,ముబారక్ అలీఖాన్, సాదిక్, సోలిపూర్ అనిల్, చందూలాల్, కరుణాకర్, రాయికల్ శ్రీనివాస్, చందు నాయక్, రవితేజ, తుపాకుల శేఖర్, రమేష్, మెప్మా సిబ్బంది పట్టణ సమైక్య అధ్యక్షురాలు జయమ్మ, గోసియా,అనితా , శైలజ, విజయ, భాను, సునీత, స్వప్న, నీరజ, సంగీత ,గౌరమ్మ, అనిత, బాలమణి జ్యోతి ,తదితరులు పాల్గొన్నారు.

# పిప్పిరి రైతుల కల సాకారం

- మార్కెట్ సబ్‌యార్డ్‌కు ప్రభుత్వ గ్రీన్‌సిగ్నల్ -
- జీఓ విడుదలతో మండలవ్యాప్తంగా హర్షం
- రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం: మల్లెపూల నర్సయ్య





GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Agriculture and Cooperation Department - Agricultural Market Committee, Boath, Adilabad, District -Establishment of Sub-Market Yard at Pipri (V) of Bazarhathnur (M) under Agricultural Market Committee, Boath under clause (a), sub-clause (bb) of clause (b) and clause (c) of sub-section (3) of section of 4 of the Telangana (Agricultural Produce and Livestock ) Markets Act, 1966 (Act No.16 of 1966) - Notification - Orders - Issued.

AGRICULTURE AND CO-OPERATION (MKT-I) DEPARTMENT

G.O.Ms.No. 33 | Dated: 27.05.2026

Read:

From the Director of Agricultural Marketing, Hyderabad, Lr.No.AGM/STRY/S-III/898058/2026, Dt.02.03.2026.

* * *


ORDER:-

The following notification shall be published in an Extraordinary Issue of the Telangana Gazette, Dated: .05.2026.

NOTIFICATION

In exercise of the powers conferred under clause (a), sub-clause (bb) of clause (b) and clause (c) of sub-section (3) of section 4 of the Telangana (Agricultural Produce and Live Stock) Markets Act, 1966 (Act No.16 of 1966), the Government of Telangana hereby direct the Market Committee specified in column (2) of the Annexure, to establish a market / Sub-Market Yard at the place specified in column (3) and the limits of that market specified in column (5) thereof, for purchase and sale of the Agricultural Produce, Live Stock or products of Live Stock and Vegetables or fruits specified in Schedule-II to the Food and Agriculture Department notification issued in G.O.Ms.No.2095, Dated:29.10.1968 and published at pages 1035-1039 of part-II of the Andhra Pradesh Gazette No.44, Dated:07.11.1968 read with G.O.Ms.No.286, Agricultural & Cooperation (Mktg.I) Department, Dt:05.07.1994, Andhra Pradesh, Hyderabad.

Contd..Pg.2.



:: 2 ::

ANNEXURE

(To G.O.Ms.No. 33, Agriculture and Cooperation (MKT.I) Dept., Dated:27.05.2026)

| Name of The District | Name of the AMC constituted under Section 4 (1) of Telangana (Agricultural Produce and Live stock) Markets Act, 1966 | Place where Market Yard to be established by the AMC under Section 4 (3) (a) (b) (bb) of the T(AP&LS) Markets Act, 1966. | Notified Agricultural Produce, Live stock or products of Live stock and Vegetables or Fruits under Section 4(3)(a), (b) &(bb) | Limits of Market area under Section 4 (3)(c) | Notified Market area under Section 4 (3)(c) of Telangana (AP&LS) Markets Act, 1966 |
|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) |
| Adilabad | Agricultural Market Committee, Boath. | Sub-Market Yard at Pipiri Village of Bazarhathnur Mandal under Agricultural Market Committee, Boath. | All notified Agricultural Produce, Live stock or products of Live stock and Vegetables or fruits specified in schedule-II of G.O.Ms. No.2095 F&A (Agri.iv) Dept., Dt: 29.10.1968 | Sub-Market in 5.00 Acres of land Sy.No.126 belonging to AMC, Boath Boundaries: East : Govt. Land West : Laxmipur Thanda Road North: Govt. Land/ South: Crusher Machine Land | Entire Revenue Villages of Bazarhathnur Mandal of Adilabad District under notified area of AMC, Boath. |

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

K.SURENDRA MOHAN
APC & SECRETARY TO GOVERNMENT

To
The Commissioner, Printing, Stationary & Stores, Purchase (Printing wing), Telangana State, Hyderabad for publication of notification in extraordinary issue of Telangana State Gazette.
The Director of Agricultural Marketing, Hyderabad.
The Agricultural Market Committee, Boath, Adilabad District (through the Director of Agricultural marketing, Hyderabad)
Copy to:-
The District Collector, Adilabad District.
The OSD to Hon'ble Minister for Marketing.
The P.S. to APC and Secretary to Government.
The Law (G) Department.
Sf/Sc.

//FORWARDED::BY ORDER//

SECTION OFFICER

**ఆదిలాబాద్ జిల్లా , మే 29: (నేటి దర్శిని):** ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని పిప్పిరి గ్రామంలో మార్కెట్ సబ్‌యార్డ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలుపుతూ జీఓ నెం.33ను మే 27న జారీ చేయడంతో మండల వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న ఈ డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభించనుంది.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేపట్టిన ప్రజాపాదయాత్ర సందర్భంగా పిప్పిరి రైతులు మార్కెట్ సబ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ సబ్‌యార్డ్‌కు ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. మార్కెట్ సబ్‌యార్డ్ ఏర్పాటుతో బజార్‌హత్నూర్ మండలంలోని అన్ని గ్రామాల రైతులకు విశేష ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను స్థానికంగానే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు రవాణా ఖర్చులు తగ్గి, పంటలకు గిట్టుబాటు ధర లభించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.
ఈ సబ్‌యార్డ్ మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట్ల రమణారావు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లకు మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానుండటంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయని, పిప్పిరి ప్రాంతం వ్యవసాయ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిప్పిరి సర్పంచ్ కృష్ణకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జల్కె పాండురంగ్, చిలుకూరి భూమన్న, గవ్వల దేవేందర్, కళ్లెం విట్టల్, విజేందర్, విలాస్, శ్రీనివాస్, గాండ్ల రమేష్, చట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాలయ్య హీరోయిన్ గ్లామర్ ట్రీట్.. ఫొటోలు వైరల్!

# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు




అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

## ఆ సాంగ్ వల్ల.. నన్ను ఇష్టపడని వారు కూడా

# నాకు ఫోన్ చేసి మెచ్చుకున్నారు..



అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోయిన ఈ చిన్నది ఇప్పుడు సినిమాల స్పీడ్ తగ్గించింది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్ లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆతర్వాత వరుసగా విజయాలను అందుకుంది.తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్ గా రాణిస్తుంది శ్రుతిహాసన్. మొన్నామధ్య హిందీలోనూ ట్రై చేసింది.. కానీ అక్కడ లక్ కలిసి రాలేదు. దాంతో ఇప్పుడు తెలుగు. తమిళ్ సినిమాల పైనే ఎక్కువ దృష్టిపెడుతుందిప్రభాస్ హీరోగా నటించిన సలార్ సినిమాతో భారీ హిట్ అందుకుంది. ఆ సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా మారిపోయింది శ్రుతి. అలాగే సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలోనూ నటించి మెప్పించింది. ఇప్పుడు సలార్ 2లో నటిస్తుంది. కాగాశ్రుతి కేవలం నటిగానే కాదు సింగర్ గాను తన ప్రతిభ చాటుకుంటుంది. ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూనే ఛాన్స్ దొరికినప్పుడల్లా సినిమాల్లోనూ పాడుతుంది. మొన్నామధ్య నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలోనూ ఓ పాట పాడింది శ్రుతి. హీరోయిన్ గా, సింగర్ గా రాణిస్తున్న ఈ అమ్మడు స్పెషల్ సాంగ్స్ లోనూ అదరగొడుతుంది. ప్రస్తుతం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తుంది శ్రుతి.. ఇటీవలే ఈ సాంగ్ ను విడుదల చేశారు. డాన్స్ ఇరగదీసింది ఈ ముద్దుగుమ్మ.. కాగా మొన్నామధ్య కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమాలోనూ ఓ పాటను పాడింది ఈ అమ్మడు. ఈ సాంగ్ గురించి ఆమె మాట్లాడుతూ.. నా జీవితకాలంలో ఎన్నో పాటలు పాడాను.. ప్రేక్షకులను నా సాంగ్స్ ను ఎంజాయ్ చేశారు.. కానీ ఎప్పుడు ఇంత రెస్పాన్స్ రాలేదు. థగ్ లైఫ్ సినిమాలో నేను పాడిన పాటకు మంచి స్పందన వచ్చింది. నన్ను ఇష్టపడని వారు కూడా ఇప్పుడు నాకు మెసేజ్ లు చేశారు. నాన్న సినిమాలో పాట పాడటం నాకు జీవితంలో మర్చిపోలేని అనుభవం. నా లాఫ్ లో మెమరబుల్ సాంగ్ అంటూ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు మరోసారి చక్కర్లు కొడుతున్నాయి.


# బాలీవుడ్ రీ-ఎంట్రీకి విజయ్ దేవరకొండ స్కెచ్..

- మ్యాడాక్ బ్యానర్‌లో విక్రమ్ కుమార్‌తో క్రేజీ ప్రాజెక్ట్!



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత కీలకమైన, అత్యంత బిజీ ఫేజ్‌లోకి అడుగుపెట్టినట్లు కనిపిస్తోంది. వరుస ప్రాజెక్టులతో వివిధ చిత్ర పరిశ్రమల్లో తన మార్కెట్‌ను విస్తరించుకునేందుకు విజయ్ గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు. లైగర్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ రౌడీ స్టార్, ఇప్పుడు హిందీ చిత్రసీమలో మరో ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.తాజాగా విజయ్ దేవరకొండ ముంబైలోని ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ 'మ్యాడాక్ ఫిల్మ్స్' కార్యాలయంలో కనిపించడం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మనం, 24 వంటి విభిన్న చిత్రాలతో పాటు దూత వెబ్ సిరీస్‌తో మెప్పించిన ప్రముఖ దర్శకుడు విక్రమ్ కుమార్‌తో విజయ్ దేవరకొండ ఒక భారీ ప్రాజెక్ట్‌ను ఓకే చేసే పనిలో ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ భేటీలో విక్రమ్ కుమార్ వినిపించిన ఒక భారీ స్థాయి కాన్సెప్ట్ విజయ్‌కి బాగా నచ్చిందని, కథలోని ఎమోషనల్ డెప్త్ మరియు కమర్షియల్ అంశాలు ఆయనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సమాచారం. గత ఆరు నెలలుగా వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన కథా పరమైన చర్చలు ఇప్పటికే ముగియగా, ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలు మరియు నిర్మాణ ఫార్మాలిటీస్‌పై చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇవి తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తెలుగుతో పాటు హిందీ మార్కెట్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో రూపొందించనున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, ప్రస్తుతం పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌పై దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన చేతిలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్', రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో 'రణబాలి' చిత్రాలతో పాటు 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యవ్ దర్శకత్వంలో ఒక ఎమోషనల్ డ్రామా ఉన్నాయి. ఈ క్రేజీ లైనప్‌కు ఇప్పుడు విక్రమ్ కుమార్ మరియు మ్యాడాక్ ఫిల్మ్స్ కాంబినేషన్‌లో రాబోయే పాన్ ఇండియా సినిమా తోడుకావడంతో అటు అభిమానుల్లోనూ, ఇటు ట్రేడ్ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. వైవిధ్యమైన చిత్రాలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న విజయ్ దేవరకొండ కెరీర్‌కు రాబోయే కాలం అత్యంత కీలకంగా మారనుంది

# కన్నీటిలో దాచుకున్న ప్రేమ నువ్వనీ.



దర్శకుడు వెంకీ కుడుముల నిర్మాతగా మారి నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం ద్వారా మహేశ్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వరరాజన్ కథానాయిక. ప్రచార చిత్రాలు ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా ఈ సినిమా ఫస్ట్ సింగిల్‌ని అగ్ర హీరో నాని విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.కన్నుదాటి జారే నీటిలో.. దాచుకున్న ప్రేమే నువ్వనీ.. గొంతులోనే ఆగే మాటలో.. చెప్పుకోనీ బాధే నువ్వనీ..' అంటూ ఈ పాట ప్రోమో సాగింది. కల్యాణ్‌చక్రవర్తి రాసిన ఈ పాటను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ స్వరపరచగా, మరో స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ ఆలపించడం విశేషం. ఈ పాటలో సంజన ఆలపించిన కర్ణాటిక్ నోట్స్, హర్షవర్ధన్ ర్యాప్ సెగ్మెంట్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. దూరం నుంచి హీరోయిన్‌ని ప్రేమించే హీరో ప్రేమభావాలను ఈ పాట ఆవిష్కరిస్తున్నది. ఈ పాటలో హీరో అనీష్ డాన్స్, విజువల్‌గా ఫ్రెష్ ఫీల్ ఇస్తున్నది. అనస్వరరాజన్ అందంగా, గంభీరంగా పాటకు ఆకర్షణగా నిలిచింది.

# సూపర్ స్టార్‌తో అనసూయ స్పెషల్ మూమెంట్..

## వైరల్ అవుతున్న ఫోటోలు!



టాలీవుడ్ బుల్లితెరపై యాంకర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న నటి అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం సినిమాల్లో కూడా తనదైన ముద్ర వేస్తోంది. 'జబర్దస్త్' షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైన అనసూయ, ఆ తర్వాత వెండితెరపై వరుస అవకాశాలు అందుకుంటూ బిజీ ఆర్టిస్ట్‌గా మారిపోయింది. ముఖ్యంగా గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్త పాత్రతో అనసూయ నటిగా కొత్త గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. అనంతరం 'పుష్ప' సినిమాలో దాక్షాయణిగా కనిపించి పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించింది. ఇలా ఒక్కో చిత్రంలో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది.ఇదిలా ఉంటే.. ఇటీవల అనసూయ తన కుటుంబంతో కలిసి సమ్మర్ వెకేషన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ట్రిప్‌లో ఆమెకు ఊహించని ఓ స్పెషల్ మూమెంట్ దక్కింది. సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో లెజెండరీ స్టార్‌గా పేరు తెచ్చుకున్న సూపర్ స్టార్ రజినీకాంత్‌ను అనసూయ ప్రత్యక్షంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనతో కలిసి దిగిన ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది.అంతేకాకుండా "మై ఆల్ టైమ్ ఫేవరెట్" అంటూ రజినీకాంత్‌పై తన అభిమానాన్ని వ్యక్తపరిచింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. అనసూయ ముఖంలో కనిపిస్తున్న ఆనందం, రజినీకాంత్‌తో ఆమెకు ఉన్న అభిమానం ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఈ ఫోటోలపై సోషల్ మీడియాలో పలు ఆసక్తికర చర్చలు కూడా జరుగుతున్నాయి. కొందరు నెటిజన్లు రజినీకాంత్ నటిస్తున్న తదుపరి చిత్రంలో అనసూయకు కీలక పాత్ర దక్కిందని, అందుకే ఈ ఫోటోల ద్వారా హింట్ ఇచ్చిందని అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం ఇది పూర్తిగా అభిమానంతో దిగిన ఫోటో మాత్రమేనని, సెలవుల్లో అనుకోకుండా కలిసిన సందర్భమని చెబుతున్నారు.ఏదేమైనా, సూపర్ స్టార్ రజినీకాంత్‌తో అనసూయ దిగిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. మరోవైపు అనసూయ నటిగా వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతుండగా.. ఆమె తదుపరి ప్రాజెక్టులపై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, RNI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365